క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన రమణారావు

జలదంకి: నూతన తహసీల్దార్‌గా అన్నదాత వెంకటరమణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పద్మావతి ప్రస్తుతం సెలవులో ఉన్నారు. దీంతో ఏఎస్‌పేట తహసీల్దార్‌గా పనిచేస్తూ దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఏవీ రమణారావును జలదంకికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్లు

సోమశిల: అనంతసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే శిక్షణ నిర్వహించారు. ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు సురేష్‌కుమార్, శ్రీలత సర్వేకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ


క్రికెట్ కిట్‌లు అందజేస్తున్న పీఎంసీ చైర్మన్ రియాజ్

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లోని క్రీడాకారులకు జెడ్పీటీసీ మోది రామాజంనేయులు యాదవ్ అందజేసిన క్రికెట్ కిట్‌లను శుక్రవారం గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ షేక్ రియాజ్ పంపిణీ చేశారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ కిట్‌లు వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.

చికెన్ వ్యర్థాలు వేస్తే లైసెన్సులు రద్దు

- మత్స్యశాఖ ఎస్‌టీఓ పొట్టయ్య


చేపల గుంతలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ ఎస్‌టీఓ పొట్టయ్య

సంగం: చేపల గుంతలు సాగు చేస్తున్న నిర్వాహకులు గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని మత్స్యశాఖ ఎస్‌టీఓ పొట్టయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పడమటిపాళెం, ఎస్‌వీఆర్‌పురం, దువ్వూరు ప్రాంతాల్లో సాగులో ఉన్న చేపల గుంతలను ఆయన పరిశీలించారు. చేపల గుంతల్లో వేస్తున్న చికెన్ వ్యర్థాలను పరిశీలించి యజమానులను హెచ్చరించారు. చికెన్ వ్యర్థాలతో పరసరాల్లో జల కాలుష్యం, దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు గురువుతున్నారన్నారు. నిత్యం పలువురు గ్రామస్తులు చికెన్ వ్యర్థాల వినియోగంపై తమకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఆయన వెంట మత్స్యశాఖ సిబ్బంది ఉన్నారు.

సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని 4వ వార్డుకు చెందిన షేక్ రసూల్, 2వ వార్డు వెంకట్రావుపల్లికి చెందిన బాలంరెడ్డి రమణమ్మ మరణించడంతో వారి అంత్యక్రియల కోసం సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శివాకోటారెడ్డి, మెప్మా ఆర్‌పీలు మహ్మద్ జానీ, సుజాత, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెట్ట భూములకు జలకళ

సాగునీటి వనరుల్లేని సన్న, చిన్నకారు రైతుల మెట్ట భూములకు భూగర్భ జలాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తోంది. నిన్నా.. మొన్నటి వరకు బీళ్లను తలపించిన భూములు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ప్రభుత్వమే బోర్లు వేయించి ఇవ్వడంతో పచ్చగా పరిధ విల్లుతున్నాయి. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే బోర్లు నిర్మించి అందించడంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతరం బోర్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.


ఆత్మకూరు మండలం రావులకొల్లులో వైఎస్సార్ జలకళ ద్వారా బోరు ఏర్పాటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

సాగునీటి వనరుల్లేని భూముల్లో బోర్ల నిర్మాణం

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి
- అన్నదాతల్లో ఆనందం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ప్రాంతంలో సాగునీటి కోసం ఆందోళన చెందుతున్న రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ఓ వరంలా మారింది. అర్హత కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు వారి పొలంలో ఉచితంగా బోరు ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన ప్రణాళికను నియోజకవర్గ రైతులు సద్వినియోగం చేసుకునేలా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మెట్ట రైతాంగానికి సాగు కోసం నీటిని అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఏర్పాటు చేసే బోర్లు శరవేగంగా ఏర్పాటు చేసే లక్ష్యంతో ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2,107 బోర్లు ఇప్పటి వరకు వేయగా అత్యధికంగా ఆత్మకూరు నియోజకవర్గంలోనే 637 బోర్లు వేయడం విశేషం.

ఎస్సీ, ఎస్టీ, మహిళ, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత

2020లో సెప్టెంబర్ 28న వైఎస్సార్ జలకళ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 2.5 ఎకరాల భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులు తమ పొలంలోనే బోర్లు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు, చిన్న, సన్నకారు రైతులకు అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చేలా పథకానికి రూపకల్పన చేశారు. గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులకు వీఆర్ఓ పరిశీలన అనంతరం డ్వామా అధికారులు, ఎంపీడీఓకు నివేదికలను పంపుతారు. భూగర్భ జలాల లభ్యతపై జియాలజిస్టుతో బోరుబావులను డ్రిల్లింగ్ చేసే కాంట్రాక్టర్ సర్వే చేయించి ఫీజుబిలిటి నివేదికలను ఏపీడీ, ఎంపీడీఓలకు అందిస్తారు.

ఎప్పటికప్పుడు సమాచారం

ఉచిత బోరు నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న రైతుకు తన దరఖాస్తు ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా సెల్‌ఫోన్‌కు సమాచారమందుతుంది. బోరుబావి డ్రిల్లింగ్ పూర్తయిన వెంటనే సదరు కాంట్రాక్టర్ సమక్షంలోనే లబ్ధిదారుడి ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేస్తారు. ప్రతి బోరుకు సోషల్ ఆడిట్ కూడా నిర్వహిస్తారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,558 మంది రైతులు తమకు బోర్లు కావాలని దరఖాస్తు చేయగా,


వైఎస్సార్ జలకళ పథకం ద్వారా సబ్ మెర్సిబుల్ మోటార్‌ను ఏర్పాటు చేస్తున్న రైతులు

అందులో 891 మంది రైతులకు బోర్లు వేసేందుకు అధికారులు అన్ని నివేదికలను సిద్ధం చేసుకున్నారు. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయి. వారికి కూడా సర్వే పూర్తి చేసి శరవేగంగా బోర్లు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ మొదటి వారం నాటికి నియోజకవర్గంలో 637 బోర్లు వేశారు. ఇందుకోసం రూ.841 లక్షలను వెచ్చించారు. మిగిలిన 254 బోర్లను త్వరలోనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనంతసాగరం మండలంలో 68, ఏఎస్‌పేట 274, ఆత్మకూరు 98, చేజర్ల 94, మర్రిపాడు 101, సంగం మండలంలో రెండు బోర్లు వేశారు.

నవరత్నాలు.. పేదల జీవితాల్లో వెలుగులు

- 2న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి
- వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలోనే సుమారు రూ.1002.51 కోట్లు ఖర్చు చేశారని, అందులో సంగం మండలంలో రూ.173.74 కోట్ల నిధులు వెచ్చించారన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు సైతం నిర్వహిస్తున్నారన్నారు. విద్యాభివృద్ధి, వైద్య సదుపాయాల మెరుగు, వ్యవసాయ సలహాలు, డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటును ఏడీఎఫ్ ద్వారా నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల నియోజకవర్గానికి 58 దేవాలయాలకు నిధులు మంజూరు చేయించారని, అందులో మండలంలోని కొరిమెర్ల, అన్నారెడ్డిపాళెం, మర్రిపాడు, సిద్ధీపురం, తలుపూరుపాడు గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించగా, సంగం, కోలగట్ల, తరుణవాయి మజారా ఉడ్‌హౌస్‌పేట గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే రెండు జాబ్ మేళాలు నిర్వహించారని, నవంబర్ 2న దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో 2 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మరోమారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డి, సొసైటీ చైర్మన్ నూరి మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు కరిముల్లా, బాల అంకయ్య, ప్రసాద్ రెడ్డి, వేణు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులు అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా పనులు మరింత వేగవంతమవుతాయన్నారు. మండల సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే ఎలాగని ప్రశ్నించారు. ఎటువంటి సమాచారం లేకుండా గైర్హాజరైన అధికారులపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికను పంపాలని ఎంపీడీఓకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా నవంబర్ 2వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, మండలంలోని నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతినాయుడు, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, తహసీల్దార్ కృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికీ అర్థమయ్యేలా తెలియజేయడానికి ప్రతి సచివాలయంలో బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ముందుగా నిర్ణయించిన తేదీల్లో సచివాలయం వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని బట్టేపాడులో నవంబర్ 1న, నువ్వూరుపాడులో 2న, చెర్లోయడవల్లిలో 3న ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా ప్రభుత్వానికి మద్దతివ్వండి


లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న రాజారెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలబెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో సంపూర్ణ మద్దతిచ్చి ఆదరించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి కోరారు. వింజమూరులోని సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌లు లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డే చేశారన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి ప్రయోజనం కల్పిస్తూ జనరంజకంగా పాలిస్తున్నారన్నారు. 2014లో అనేక అబద్ధాలాడి అధికారంలోకి వచ్చిన టీడీపీ ఏ ఒక్క వాగ్దానం కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాల్లో 99.5 శాతం అమలు చేశారన్నారు. మళ్లీ టీడీపీ, జనసేన బూటకపు మేనిఫెస్టోతో వచ్చే ఎన్నికల్లో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, పార్టీ, మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సుజన, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గౌస్ ఏ పాక్ 40వ గంధమహోత్సవం

అనుమసముద్రంపేట: అనుమసముద్రం పంచాయతీ జామా మసీదు వద్ద గౌస్ ఏ పాక్ నిషాన్ ముబారక్ 40వ గంధమహోత్సవం వైభవంగా నిర్వహించారు. జామా మసీదు గుల్షన్ ఏ రాఫాయి సజ్జాదా నషీన్ సయ్యద్ షా ఖాజా అఫ్జార్ రఫాయి తాజ్మీ హుస్సేన్ బసరవి సూఫీ ఆధ్వర్యంలో గంధమహోత్సవం నిర్వహించారు. తొలుత గంధం బాణసంచా సందడి, ఫకీర్ల డప్పు వాయిద్యాలు పూల చద్దర్లతో ఏఎస్‌పేటలోని హజరత్ దర్గాకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం గౌస్ ఏ పాక్ నిషాన్ వద్దకు గంధం తీసుకెళ్లారు. ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపటి నుంచి ఉచిత కంటి వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 29 నుంచి నవంబరు 4వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని మహిమలూరు శ్రీనివాసులు, యర్రం రెడ్డి నాగమోహన్‌రెడ్డి, నిజమాల నరసింహులు తెలిపారు. భారత రక్షణశాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి ప్రోత్సాహంతో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నారుమళ్లకు నీటిని విడుదల చేయండి

అల్లూరు: అల్లూరు మండలంలో నారుమళ్లు పోసుకునేందుకు వెంటనే నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమశిల జలాశయంలో 30 టీఎంసీల నీరు ఉన్నప్పటికి ఇప్పటి వరకు అల్లూరు మండలానికి అధికారులు నీటిని విడుదల చేయకపోవడం ఏమిటని వాపోయారు. త్వరత గతిన ఐఏబీ సమావేశం నిర్వహించి నారుమళ్లకు నీటిని విడుదల చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం ఎస్టీ కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ కుటుంబానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి శుక్రవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. దుర్గాప్రసాద్ నివాసముంటున్న పూరి గుడిసె మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధమై కట్టు బట్టలతో మిగిలిన విషయం తెలిసిందే. శ్రీనాథ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు రక్తదాన శిబిరం

ఉదయగిరి: పోలీసు అమరవీరుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం జరుగుతుందని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈ క్రాప్ జాబితా సరి చూసుకోండి


బ్రాహ్మణక్రాక ఆర్బీకేలో ఈ క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ

జలదంకి: 2023 ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలపై నమోదు చేసిన ఈ క్రాప్ జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు ఏఓ బి.శైలజ తెలిపారు. శుక్రవారం బ్రాహ్మణక్రాక, చామదల, సోమవరప్పాడు, చామదల, గట్టుపల్లి, చినక్రాక తదితర గ్రామాల్లోని ఆర్బీకేల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు సందేహాలు ఉంటే ఈ నెల 30వ తేదీ లోగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మునెమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


ఏఎస్‌పేట: ఈ క్రాప్ జాబితాలను చూపుతున్న ఏఓ రజని

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ జాబితా ప్రదర్శన

అనుమసముద్రంపేట: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో 2023 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతుల పరిశీలన కోసం ప్రదర్శించినట్లు ఏఓ రజనీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఈ జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందని, ఈ జాబితాలో ఏమైనా మార్పులు చేయాల్సి ఉంటే ఆ విషయాలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

షాదీమంజిల్ మరమ్మతులకు సహకారం



కావలి: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న షాదీమంజిల్‌ను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కొంత కాలంగా షాదీమంజిల్ ఆలనా పాలన లేక, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో షాదీమంజిల్‌కు మరమ్మతులు చేయించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం ప్రముఖులు నడుంబిగించారు. దీంతో ఎమ్మెల్యే దృష్టికి షాదీమంజిల్ ఆవశ్యకతను తీసుకెళ్లడంతో ఆయన సందర్శించారు. షాదీమంజిల్ లోపల, బయట భవన పరిస్థితులను ఎమ్మెల్యే ముస్లిం ప్రముఖులను అడిగి తెలుసుకున్నారు. ఎలా చేస్తే బావుంటుందో అందరితో మాట్లాడి సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని, అందుకు వ్యక్తిగతంగా తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం లభిస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, మారుమూల పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకుంటున్నారని, వందల సంఖ్యలో ఓపీలు నమోదు కావడమే ఇందుకు నిదర్శనమన్నారు.


మర్రిపాడు: పడమటినాయుడుపల్లిలో ఐసీడీఎస్ స్టాళ్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, మండల కన్వీనర్ బొర్రా వెంకటసుబ్బారెడ్డి, వైద్య విస్తరణాధికారి కొండారెడ్డి, సచివాలయ కన్వీనర్ మన్నే బాలకొండారెడ్డి, ఎంపీడీఓ నాగమణి డాక్టర్ గోపీనాథ్ తదితరులు


ఉదయగిరి: గుడినరవ శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, ఎంఈఓ టి.శ్రీనివాసులు, సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, వైద్యాధికారిణి శివకల్పన తదితరులు


జలదంకి: జమ్మలపాళెంలో రోగులకు ఆరోగ్య కిట్లు అందజేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్కా మదన్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, స్థానిక సర్పంచ్ బుర్రి శ్రీవేణి, ఈఓపీఆర్డీ రామకృష్ణారెడ్డి తదితరులు


కొండాపురం: నేకునాంపేటలో లబ్ధిదారులకు మందులు అందిస్తున్న ఎంపీపీ బొడ్డు అనూరాధ, సర్పంచ్‌లు బాసం జయమ్మ, బీబీజాన్, వైద్యాధికారులు నసరుద్దీన్, రేవంత్, సుదీప్ యాదవ్, ప్రసన్నలక్ష్మి తదితరులు


వరికుంటపాడు: కాంచెర్వులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


సంగం: తరుణవాయిలో చిన్నారికి బాలామృతం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తుంగా ఇందూదర్‌రెడ్డి, కోటారెడ్డి, బాలానాయుడు, ఎంపీడీఓ గోపి, వైద్యులు శ్రీనివాసులరెడ్డి, ప్రతిమ, ఎంపీటీసీ పెంచలమ్మ తదితరులు